

కంచి కామకోటి పీఠాధిపతి శంకరాచార్య విజయేంద్ర సరస్వతి శనివారం అయోధ్యలోని రామమందిరాన్ని దర్శించారు. యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.

## జగమంతా రామమయం

### ప్రపంచవ్యాప్తంగా ఘనంగా వేడుకలు..

- అమెరికాలో పండుగ వాతావరణం
- వివిధ నగరాల్లో కారు ర్యాలీలు, టెస్లా లైట్ షో
- 50కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారాలు

న్యూఢిల్లీ, జనవరి 21: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం కోసం ప్రపంచం యావత్తు ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షించేందుకు 50కిపైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు చేశారు. రథయాత్రలు, కారు, ఆటో ర్యాలీలు, హిందూ ఆలయాల్లో దీపాల వేడుక వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

**అమెరికాలో కార్లతో పరేడ్**

అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ వేడుక ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ సహా అమెరికాలోని 300 ప్రముఖ ప్రదేశాల్లో ఏర్పాట్లు జరిగాయి. వివిధ నగరాల్లో ఆటో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 10 రాష్ర్టాల్లో 40కిపైగా బిల్‌బోర్డులను విశ్వహిందూ పరిషత్ విభాగం ఏర్పాటు చేసింది. ఇక దేవాలయాల్లో గత వారం రోజులుగా పండుగ వాతావరణం నెలకొన్నది. కాషాయ జెండాలు చేతబూని, కాలిఫోర్నియాలో 1100 మంది కార్ల ర్యాలీని చేపట్టారు. న్యూజెర్సీలో 350 కార్లతో పరేడ్ నిర్వహిస్తున్నారు. వాషింగ్టన్ డీసీలో జరగనున్న మ్యూజికల్ షోలో 100కుపైగా టెస్లా కార్లు పాల్గొంటున్నాయి. 21 నగరాల్లో టెస్లా కారు ర్యాలీలు జరగనున్నాయి.

**ఫ్రాన్స్‌లో గ్రాండ్ రథయాత్ర**

ఇక ఫ్రాన్స్‌లో భారతీయులు 'గ్రాండ్ రథయాత్ర'ను చేపట్టారు. పారిస్‌లోని డీ లాచాపెల్ వద్ద గణేశ్ ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై, నగరంలోని ప్రముఖ ప్రదేశాల గుండా కొనసాగనున్నది. అయోధ్య వేడుకపై ఈఫిల్ టవర్ వద్ద ప్రత్యక్ష ప్రసారాలు చేపట్టారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, మారిషస్.. మొదలైన దేశాల్లో 'విగ్రహ ప్రతిష్ఠ' కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**మారిషస్‌లో రెండు గంటల బ్రేక్**

మారిషస్ జనాభాలో 48 శాతం హిందువులే. నేడు ఆ దేశంలోని ప్రభుత్వం, హిందూ ప్రభుత్వ అధికారులకు రెండు గంటల స్పెషల్ బ్రేక్ (విరామం)ప్రకటించింది. 'బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన భారత్‌కు మాత్రమే కాదు, మారిషస్ ప్రజలకు కూడా అత్యంత ముఖ్యమైన కార్యక్రమం' అని ఆ దేశ హై కమిషనర్ డిల్లుమ్ అన్నారు. అక్కడి హిందూ దేవాలయాల్లో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.




అమెరికాలోని హ్యూస్టన్‌లో శనివారం రామ్(RAM) ఆకారంలో ఏర్పాటు చేసిన టెస్లా కారు లైట్ షో

## 22నే ప్రాణప్రతిష్ఠ ఎందుకు?

న్యూఢిల్లీ, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు సర్వంసిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆలయం ప్రాముఖ్యత, ప్రాణప్రతిష్ఠ ముహూర్తం, దర్శన వేళలు, మందిర నిర్మాణం.. ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు చూద్దాం..

- **ప్రాణప్రతిష్ఠ ముహూర్తం ఎప్పుడు?**
  సోమవారం(జనవరి 22న) మధ్యాహ్నం 12.15 నుంచి 12.45 మధ్య జరుగుతుంది.
- **ఆలయ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారం ఎక్కడ?**
  డీడీ న్యూస్, డీడీ నేషనల్ చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. దూరదర్శన్ ఈ లైవ్ ఫీడ్‌ను ఇతర వార్తా సంస్థలతో కూడా పంచుకుంటుంది. ఉదయం 11 గంటల నుంచి 1 వరకు జరిగే పూజా కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.
- **మందిరం దర్శన వేళలు ఎప్పుడు?**
  ప్రాణప్రతిష్ఠ తర్వాత జనవరి 23 నుంచి సాధారణ భక్తులకు బాలరాముడి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఉదయం 7 గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆలయ తలుపులు తెరిచి ఉంటాయి.
- **ప్రవేశ రుసుం ఉన్నదా?**
  భక్తులకు ఆలయ ప్రవేశం ఉచితం. పాస్‌లు పొందితే హారతి కార్యక్రమం కూడా ఉచితమే.



బికనేర్ చిత్రకారిణి మిత్తు మెహ్రా రావి ఆకుపై చిత్రించిన అయోధ్య రామాలయం

- **ప్రాణప్రతిష్ఠ జనవరి 22నే ఎందుకు?**
  పుష్య మాసం శుక్ల పక్షంలోని ద్వాదశి రోజు అయిన 2024, జనవరి 22వ తేదీని ట్రస్టు ప్రాణప్రతిష్ఠకు ఎంపిక చేసింది. ఈ రోజున మహావిష్ణువు సాగర మథనంలో సాయం చేసేందుకు తాబేలుగా మారాడని పురాణాలు చెబుతున్నాయి. అదేవిధంగా ఈ తేదీ మృగశిర నక్షత్రంలో ఉన్నది. ఇది మూడు శుభ యోగాలైన సర్వార్థ సిద్ధి యోగం, అమృత సిద్ధి యోగం, రవి యోగాలను తెస్తున్నది. కావున జనవరి 22వ తేదీ సాంస్కృతిక, పురాణ, ఖగోళ ప్రాముఖ్యం కలిగి ఉన్నది.
- **బాలరాముడి విగ్రహం పొడవెంత?**
  రామ్‌లల్లా విగ్రహం 51 అంగుళాల పొడవు, 1.5 టన్నుల బరువు ఉంటుంది. ఐదేండ్ల వయసులోని బాలరాముడి విగ్రహాన్ని కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన అరుణ్ యోగిరాజ్ అనే శిల్పి చెక్కాడు.
- **మందిర శంకుస్థాపన ఎప్పుడు జరిగింది?**
  2020, ఆగస్టు 5న ప్రధాని హోదాలో మోదీ శంకుస్థాపన చేశారు.
- **నిర్మాణ పనులను ఎవరు పర్యవేక్షించారు?**
  రామాలయ నిర్మాణం, ఇతర నిర్వహణను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఏర్పాటు చేసిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చూస్తున్నది. ఎల్ అండ్‌టీ కంపెనీ నిర్మాణం చేస్తున్నది.
- **అయోధ్యకు ఎలా వెళ్లాలి?**
  యూపీలోని అయోధ్యకు వెళ్లేందుకు పలు రైలు, రోడ్డు మార్గాలు ఉన్నాయి. కొత్త ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి.
- **అయోధ్య రామాలయాన్ని ఎవరు డిజైన్ చేశారు?**
  దశాబ్దాల క్రితమే అయోధ్య రామాలయ డిజైన్‌ను ఆర్కిటెక్ట్ చంద్రకాంత్ సోంపుర రూపొందించారు.

## మాల్దీవుల ప్రభుత్వ నిర్లక్ష్యానికి బాలుడి బలి

- భారత విమానానికి అనుమతి ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం

న్యూఢిల్లీ: మాల్దీవుల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆ దేశానికి చెందిన 14 ఏండ్ల బాలుడు బలయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడిని భారత్‌కు చెందిన డోర్నియర్ విమానంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్నా అక్కడి ప్రభుత్వవర్గాల నుంచి సమయానికి అనుమతి రాక, బాలుడికి సకాలంలో వైద్యం అందక చనిపోయాడు. అక్కడి మీడియా కథనాల ప్రకారం.. విల్మింగ్టన్ అనే దీవిలో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న 14 బాలుడికి ఈ నెల 17న స్ట్రోక్ వచ్చింది. అతడి సమీప దవా ఖానకు తీసుకెళ్లగా, దేశ రాజధాని మాలెకు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. బాలుడి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు భారత్‌కు చెందిన డోర్నియర్ విమానం బాలుడిని తరలించడానికి సిద్ధమైనప్పటికీ అక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఎట్టకేలకు మరుసటి రోజు ఆ దేశ వైమానిక దళమే బాలుడిని మాలెకు తరలించింది. విలువైన 16 గంటల సమయం వృథా కావడంతో ఐసీయూలో చేర్పించి చికిత్స అందించినప్పటికీ బాలుడి ప్రాణాలు దక్కలేదు.

## అమెరికాలోని రెండు పాఠశాలల్లో హిందీ



వాషింగ్టన్, జనవరి 21: పాఠశాలల్లో హిందీని ప్రపంచ భాషగా ప్రవేశపెట్టడంపై కాలిఫోర్నియాలోని భారతీయ అమెరికన్ల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో రెండు ప్రభుత్వ పాఠశాల పాఠ్య ప్రణాళికలో హిందీని ప్రపంచ భాషగా చేర్చారు. అక్కడి హోర్నర్ మిడిల్ స్కూల్, ఇర్వింగ్టన్ హైస్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి పాఠ్యప్రణాళికలో ప్రయోగాత్మకంగా హిందీని ప్రవేశపెట్టాలని అక్కడి బోర్డు ఈ నెల 17న నిర్ణయించింది. కాలిఫోర్నియా రాష్ట్ర విద్యా సంస్థల్లో హిందీ భాషను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. ఈ నిర్ణయాన్ని అక్కడి భారతీయ అమెరికన్లు స్వాగతించారు. వీరు తమ పిల్లల కోసం పాఠశాలల్లో హిందీని ప్రవేశపెట్టాలని చాలాకాలంగా కోరుతున్నారు. కాలిఫోర్నియాలో భారతీయ అమెరికన్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫ్రెమాంట్ నగరం ఒకటి.

## అమెరికా అధ్యక్ష బరిలో మిషెల్ ఒబామా!

వాషింగ్టన్ డీసీ: ఈ ఏడాది జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పోటీగా మాజీ దేశ మొదటి మహిళ మిషెల్ ఒబామా బరిలోకి దిగనున్నారా అంటే అవుననే అంటున్నాయి ఆ దేశ మీడియా నివేదికలు. న్యూయార్క్ పోస్ట్‌లో కాలమిస్ట్ సిండీ ఆడమ్స్ రాసిన కాలమ్, ట్రంప్ సలహాదారు రోజర్ జె.స్టోన్ అభిప్రాయాల వెల్లడి తర్వాత మిషెల్ పోటీపై అంచనాలు పెరిగాయి. వచ్చే ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా మిషెల్ ఒబామా నిలిచే అవకాశం ఉన్నదని ఇటీవల రోజర్ పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నానని, తమ సహకారం కావాలని మిషెల్ ఒబామా 2020లో ప్రముఖ సీఈవోలను కోరినట్టు ఆడమ్స్ తన వ్యాసంలో వెల్లడించారు. బైడెన్ తప్పుకునేలా పరోక్షంగా ఆమె ఇలా ఒత్తిడి తెచ్చినట్టు పేర్కొన్నారు. రాజకీయ వ్యాఖ్యాత మెగిన్ కెల్లె కూడా మిషెల్ రాజకీయ రంగ ప్రవేశం జరగొచ్చని చెప్పారు.



మిషెల్ ఒబామా

## 'వాట్సాప్' స్కాములతో జాగ్రత్త!

- హోంశాఖ మేధో సంస్థ 'బీపీఆర్‌డీ' హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 21: సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల్లో అనేక కేసులు 'వాట్సాప్'తో ముడిపడి ఉన్నాయని, హ్యాకర్లు, మోసగాళ్లు 'వాట్సాప్' ద్వారా మోసాలకు పాల్పడే అవకాశముందని కేంద్ర హోంశాఖ ఆధీనంలోని మేధోసంస్థ బీపీఆర్‌డీ హెచ్చరిక జారీచేసింది. వీటిని అడ్డుకునేందుకు కేంద్ర హోం శాఖకు కొన్ని మార్గదర్శకాలు జారీచేసింది. గుర్తు తెలియని, అనుమానాస్పద నంబర్లతో వచ్చే వాట్సాప్ కాల్స్‌ను స్వీకరించరాదని యూజర్లకు సూచించింది. 'జాబ్ ఆఫర్లు ఉన్నాయంటూ, పెట్టుబడి పథకాలు చెబుతామంటూ హ్యాకర్లు ఆయా వ్యక్తులకు వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా గాలం వేస్తున్నారు. ఆయా వ్యక్తుల సున్నితమైన సమాచారం సేకరించాక వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. వియత్నాం, కెన్యా, ఇథియోపియా, మలేషియా నుంచి హ్యాకర్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు' అని బీపీఆర్‌డీ నివేదిక పేర్కొన్నది. వాట్సాప్‌లోని 'స్క్రీన్ షేర్' ఆప్షన్‌తో సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## మార్చి 18కి నీట్ ఎండీఎస్ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 21: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (నీట్ ఎండీఎస్ 2024) మార్చి 18కి వాయిదా పడింది. ఈ మేరకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. నిజానికి ఈ పరీక్ష ఫిబ్రవరి 9న జరగాల్సి ఉంది. నీట్ ఎండీఎస్ 2024 రాసేందుకు అర్హత కటాఫ్ డేట్‌ను మార్చి 31గా పేర్కొన్నది. కాగా, నీట్ పీజీ 2024 పరీక్షను ఎన్‌బీఈఎంఎస్ ఇప్పటికే వాయిదా వేసింది. జూలై 7న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నది.

## టాటా మోటార్స్ వాహనాలు ప్రియం

**ఫిబ్రవరి 1 నుంచి ధరల పెరుగుదల**

న్యూఢిల్లీ, జనవరి 21: ప్రముఖ ప్రయాణికుల, వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటామోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచుతున్నట్టు ఆదివారం ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ వెహికల్స్ (ఈవీ) సహా అన్ని శ్రేణుల ప్రయాణికుల వాహనాల ధరలను సగటున 0.7 శాతం పెంచుతున్నట్టు తెలిపింది. ఈ పెరిగిన ధరలు ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి వస్తాయని పేర్కొంది. ఉత్పాదక వ్యయం పెరగడంతో ధరలను పెంచక తప్పలేదని, పంచ్, నెక్సాన్, హారియర్ సహా అన్ని ప్రయాణికుల వాహనాలకు ఈ ధరల పెరుగుదల వర్తిస్తుందని టాటామోటార్స్ ఆ ప్రకటనలో వెల్లడించింది.

## గాజాలో 25 వేలు దాటిన మృతులు

రఫా (గాజా స్ట్రిప్): హమాస్ మిలిటెంట్లను తుదముట్టించడమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉన్నది. మూడున్నర నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 25 వేల మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. 62 వేల మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో మూడింట రెండొంతుల మంది మహిళలు, మైనర్లు ఉన్నారు. ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు గత ఏడాది అక్టోబరు 7న విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో దాదాపు 1,200 మంది ఇజ్రాయెలీయులు మరణించారు. దీనికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నది.